ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



# జగిత్యాల
జిల్లా వార్తలు
3★★
శనివారం 21 డిసెంబరు 2024



గురుకుల పాఠశాలలో చెత్తను తరలిస్తున్న కార్మికులు

## గురుకుల విద్యార్థుల ఇంటి దారి
- వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- పారిశుధ్య పనులు ముమ్మరం చేసిన అధికారులు

4

## కేటీఆర్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు సరికాదు
డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

6


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఇతర నాయకులు

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి

ధర్మపురి, డిసెంబరు 20 ( ఆంధ్రజ్యోతి ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ధర్మపురి మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని పలు వార్డులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా వార్డులో ఎన్యుమరేటర్లు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఆయా వార్డుల్లో ఎన్యుమరేటర్లు చేపట్టిన సర్వే గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అయన వెంట మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు మహేష్ పాల్గొన్నారు.

## కేవైసీ చేసుకోవాలని వాట్సాప్ నంబర్లకు లింక్‌లు

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేరిట వచ్చిన ఏపీకే లింక్‌లు సెల్‌ఫోన్ వినియోగదారులను ఆందోళన గురి చేశాయి. మల్యాలలోని వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ పోకల నరేశ్‌కు మార్క్ శుక్రవారం హెచ్‌డీఎఫ్‌సీ కేవైసీ చేసుకోవాలని వాట్సప్‌కు లింక్‌లు వచ్చాయి. ఇలా వందల మందికి వచ్చాయి. ఖాతా కేవైసీ చేసుకోవాలనేది వాటి సారాంశం. ఇటీవల ఏపీకే పేరిట వచ్చే వాటిని ఓపెన్ చేయవద్దనే సూచనలతో నరేశ్‌కుమార్ వెంట నే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వెళ్లి ఆ నంబర్‌పై గల బ్యాంకు ఖాతాలన్నీ స్తంభింపచేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎప్పటికప్పుడు ఖాతాల్లో నగదు జమ
- ఇప్పటికే 356 కేంద్రాల మూత
- రానున్న వారం రోజుల్లో వంద శాతం పూర్తి చేసేందుకు యత్నం

# ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు



జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వా నాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే 356 కేంద్రాలు మూతపడ్డాయి. వచ్చే వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులతో దిగుబడులు తగ్గడంతో ధాన్యం అంచనా మేరకు కేంద్రాలకు రాలేదు. దీనికి తోడు పలువురు రైతులు ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యం అమ్ముకున్నారు. దీంతో ప్రభుత్వ కేంద్రాలలో లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ జర గలేదు. జిల్లాలో 2022-23 వానాకాలం సీజన్‌లో 3,79,144 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ప్రస్తుత 2024-25 వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 2,86,632 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు.

### జిల్లాలో 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు

2024 వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 3.10 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం ఎక్కువగా ఉంది. అక్కడక్కడ సన్న రకం సాగు జరిగింది. ఇందుకు గాను జిల్లాలో 5.50 లక్షల మె ట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్న

### జిల్లాలో కొనుగోళ్లు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 430 కేంద్రాల ద్వారా ధాన్యం కొ

తొలుత అంచనా వేశారు. ఈ మేరకు జిల్లా సహకార, మార్కెటింగ్, ఇందిరా క్రాంతిపథం, మెప్మా తదితర శాఖల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్టోబరు నుంచి కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు జరుపు తున్నారు. దిగుబడులు తగ్గడం వల్ల కేవలం 3.10 లక్షల వరకే ధాన్యం కేంద్రాలకు రానున్నట్లు ప్రస్తుతం గుర్తించారు.

నుగోళ్లు జరపాలని నిర్ణయించినప్పటికీ అవసరమైన ప్రాం తాల్లో 424 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 141 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 282 కేంద్రాలు, మెప్మా ఆధ్వర్యంలో ఒకటి కేంద్రాలను ఏర్పరిచారు.

జిల్లాలో ఇప్పటివరకు 58,682 మంది రైతుల వద్ద నుంచి రూ. 664.57 కోట్ల విలువ గల 2,86, 632 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో రూ. 628.52 కోట్ల విలువ గల 2,85,303 మెట్రిక్ టన్నుల ధాన్యం ట్యాబ్‌ల్లో అప్ లోడ్ చేశారు. సేకరించిన ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి గానుగాడించేందుకు మిల్లర్లకు పంపగా ట్రక్‌షీట్ జనరేట్ అయింది. ఇందుకుగాను రూ. 645 కోట్ల డబ్బులను 55,157 మంది రైతుల ఖా తాల్లో జమ చేశారు.

(తరువాయి 6వ పేజీలో)

## నరసింహుడి సన్నిధిలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పూజలు


జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్

ధర్మపురి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమ కుటుంబ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి వారిని ఘనంగా ఆశీర్వదించారు. అనంతరం ఆయనకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, నంబి నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంజన్నను దర్శించుకున్న న్యాయాధికారి

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నీలిమా కుటుంబసమేతంగా శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు సత్కరించగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఏఎస్పై చిలుక శ్రీనివాస్ ఉన్నారు.

## పెంపుడు శునకానికి బారసాల


జగిత్యాలలో పెంపుడు శునకానికి బారసాల చేస్తున్న యజమానులు

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన అయ్యోరి సుధాకర్ - రేవతి దంపతులు శుక్రవారం తమ పెంపుడు శునకం పిల్లలకు ఘనంగా బారసాల నిర్వహించా రు. వీరు కొన్ని రోజులుగా సీజ్ జాతికి చెందిన కుక్కను పెంచుకుంటున్నారు. ఆ కుక్క ఇటీవల అయిదు (రెండు మగ, మూడు ఆడ) పిల్లలకు జన్మ నిచ్చింది. ఆ పిల్లలకు శుక్రవారం ఘనంగా బారసాల చేశారు. ఉయ్యాలలో పడుకోబెట్టి పాటలు పాడి సాంప్రదాయబద్ధంగా పేర్లు పెట్టారు. అతి థులను ఆహ్వానించి భోజనాలు పెట్టారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల అర్ధనగ్న నిరసన


నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమన్యాయమైన డిమాండ్ల సాధనకై చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష శుక్రవారానికి పన్నెండవ రోజుకు చేరింది. తమ రోజువారి నిరసన కార్యక్రమంలో భాగంగా శిబిరం వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను విద్యాశాఖలో విలీనం చేస్తూ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు, భవిత సెంటర్లు, ఎంఆర్‌సీ, కేజీబీవీ పాఠశాలలు మూతపడడం వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి విద్యా శాఖలో తమను విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు బర్ల నారాయణ, కుడుకల రవీందర్, చిట్యాల రవి, పారూక్, శ్రీనివాస్ తో పాటు సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోవాలి


సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అంగన్‌వాడీ సేవలను గర్భిణులు, చిన్నారులు, కిశోర బాలికలు, వినియోగించుకోవాలని అంగన్‌వాడీ సీడీపీవో మమత అన్నారు. రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ అం గన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏడు నెలలు నిండిన చిన్నారులకు అన్న ప్రాసన, రెండు సంవత్సరాల 5 నెలలు దాటిన చిన్నారులకు అక్షరా భ్యాసం చేయించారు. అలాగే గ్రామంలోని గర్భిణులకు సీమంతం నిర్వహించారు.

ఆరు నెలలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని, ప్రైవేట్ స్కూల్‌కు దీటుగా అంగన్‌వాడీలోనే విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ప్రతి చిన్నారి అభివృద్ధికి అంగన్ వాడీ తోడ్పడు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కస్తూరి సతీష్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ, గురు కులం పాఠ శాల ఉపాధ్యాయురాలు కవిత, సూపర్‌వైజర్ పద్మావతి అంగన్‌వాడీ టీచర్ గంగజల పాల్గొన్నారు.

# విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను విడిచి గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. రెండు రోజుల వ్యవధిలో పాఠశాలలోని విద్యార్థులు ఓంకారి అఖిల్, బోడ యశ్వంత్‌లు అస్వస్థతకు గురవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఘటనపై తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో వరుసగా చోటు చేసుకున్న ఘటనాలపై సమగ్ర విచారణ చేపట్టి, సీసీ కెమెరాలను పరిశీలించి భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యార్థు లకు రక్షణ కల్పించే చర్యలు అధికారులు తీసుకోవాలని ఫోన్‌లో డీ ఎస్పీ రాములును కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉండడటం సరికాదని, తల్లిదండ్రులను విడిచి ఉన్న విద్యార్థులను స్వంత బిడ్డలగా చూసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దృష్టికి తేవాలని సూచించారు. నూతన భవనాన్ని వాడుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్, మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్ రెడ్డిలు గురుకల పాఠశాలను సందర్శించి విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉపముఖ్యంత్రి గురుకులాన్ని సందర్శించిన ఫలితం లేక పోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ కనపడుతుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, ఉపాధ్యాయులను కోరారు. వీరి వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ కోరెపు రవి, నాయకులు ఒజ్జెల శ్రీనివాస్, చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దాపూర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు..

# పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి

- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు
- కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరిక

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గురుకుల బాలుర కళాశాల, పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని కింది స్థాయి అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదే శించారు. శుక్రవారం గురుకులంలో చేస్తున్న పనులను మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పరిసరాలలో చేస్తున్న పనులను తనిఖీ చేశారు. గురుకుల ప్రహరీ చుట్టూ పరిశీలించి, గోడకు ఎలాంటి రంధ్రాలు లేకుండా పూడ్చాలని, గుంతలు లేకుండా చూడాలని, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేసి శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. ఆవరణం లో పెద్దగా ఉన్న చెట్లపైకి అధిక సంఖ్యలో కోతులు వచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అనవసరమైన చెట్లను తొలగించాలన్నారు.


గురుకుల పాఠశాలలో పర్యటిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

మున్సిపాలిటీ సిబ్బందితో గురుకుల ఆవరణంలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల లో ఆలసత్వం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా అవసరమైన అభివృద్ధి పనుల గురించి నివేదిక ఇవ్వాలని నిర్వహకులకు సూచించారు. ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న ఆరోగ్య వివరాలను మెడికల్ అధికారి అంజిత్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా గదులు, స్నానపు గదులు, కిటికీలు ఏర్పాటు, దోమలు, విష కిటకాలు గదులోనికి రాకుండా, వాటి వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల తల్లిదండ్రులు గురుకులంలో ఏం జరుగుతుందో తెలియడం లేదని, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని కలెక్టర్‌కు సమస్యలను వివరించారు. గురుకులం లోని సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించడానికి తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేసి తప్పకుండా విద్యార్థులకు అన్ని విధాలుగా రక్షణ కల్పించడమే తమ ధ్యేయమని తల్లిదండ్రులకు కలెక్టర్ భరోసా కల్పించారు. విద్యార్థుల చదువు పాడుకాకుండా తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని, అస్వస్థతకు గురైన విద్యార్థుల ఓంకారి అఖిల్, బోడ యశ్వం త్ ఆరోగ్యం కుదుటపడిందన్నారు. కలెక్టర్ వెంట డీపీవో రఘువరణ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఐ ఉమేష్, పంచాయతీ కార్యాదర్శులు, ఆసీఫ్, సిబ్బంది ఉన్నారు.

## కుట్ర కేసులు ఎన్ని పెట్టినా ఎదుర్కొంటాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు


మాట్లాడుతున్న కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, దావ వసంత

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలపై రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్ర కేసులు బనాయించినా ఎదుర్కొంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ ఆర్ఎస్‌పీ క్యాంపులో గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం కేసు బనాయించడం బాధాకరమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఈ-రేస్ వ్యవహారం పై అసెంబ్లీలో చర్చకు డిమాండ్ చేస్తే ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు విషయంలో జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతుండడం కక్షసాధింపు చర్యలేనన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, అర్బన్ మండల అధ్యక్షుడు గంగాధర్, గంగారెడ్డి, అమీన్, ప్రవీణ్, వెంకటేశ్వర్‌రావు, సల్మాన్ పాల్గొన్నారు.



## స్కూల్ కాంప్లెక్స్‌ల్లో క్విజ్ పోటీలు

కథలాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేట, సిరికొండ, కథలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని చింతకుంటలో శుక్రవారం బాల మేధ పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో అంబారిపేట స్కూల్ కాంప్లెక్స్‌లో ప్రథమ తాండ్ర్యాల, ద్వితీయ అంబారిపేట, తృతీయ స్థానంలో తుర్తి పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. చింతకుంటలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ ఊట్‌పల్లి, ద్వితీయ దుంపెట, తృతీయ స్థానంలో పోసానిపేట, సిరికొండ స్కూల్ కాంప్లెక్స్‌లో ప్రథమ స్థానం బొమ్మెన, ద్వితీయ బొమ్మెన (బీసీ కాలనీ), తృతీయ స్థానంలో సిరికొండ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా ఎంపికయ్యారు.

గెలుపొందిన విజేతలకు ప్రధానోపాధ్యాయులు వసంత, అర్జున్, కిషన్‌రావు ప్రశంసా పత్రాలు అందజేశారు.


చింతకుంటలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

## గురుకుల విద్యార్థుల ఇంటిదారి

● వరుస ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన



పెద్దాపూర్ గురుకులంలో తొలగించిన పెద్దచెట్లు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 20 (ఆంధ్ర జ్యోతి) : పెద్దాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు భయం పట్టుకుంది. దీంతో ఒక్కొక్కరుగా ఇంటి దారి పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆస్పత్రి పాలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. గురుకుల పాఠశాలలో 416, కళాశాలలో 130మంది విద్యారులు చదువుతున్నారు. వరుసగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడం వాటికి కారణాలు తెలయక పోవడంతో తల్లిదండ్రులు భయంతో తమ తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్నారు. కళాశాల విద్యార్థులు మినహా పాఠశాల విద్యార్థులు దాదాపు ఖాళీ అయ్యారు. నాలుగు నెలల క్రితం గురులంలో జరిగిన ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. తాజాగా మళ్లీ ఇద్దరు విద్యార్థులకు పాము కాటు అనే అనుమానాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టి భరోసా కల్పించేంత వరకు తమ పిల్లలను పంపించమని కలెక్టర్ సత్యప్రసాద్‌కు తల్లిదండ్రులు తెలిపారు.

### ముమ్మరంగా పారిశుధ్య పనులు

గురుకులం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పాములు, కిటక పురుగులు రాకుటండా తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలో గదుల వేనుక పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, పాత గదులను తొలగించి, పాఠశాలలో పారిశుధ్యం పనులు చేసి అన్ని వసతులను కల్పించేందుకు అధికారులు పనులు చేపట్టారు. కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో అధికారులతో గురుకులంలోని చెత్త, పిచ్చి మొక్కలు, ప్రహరీ గోడకు ఉన్న రంధ్రాలు మూసివేయడం, శానిటేషన్ పనులు చేపట్టారు. గురుకులం పెద్దచెట్లు ఉండడంతో కోతులు బెడద నుంచి రక్షణ కోసం వాటిని తొలగిస్తున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను క్షుణంగా పరిశీలించి పనులు చేయిస్తున్నారు.

### చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థుల డిశ్చార్జి

గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థులు ఓం కారి అఖిల్, బోడ యశ్వంత్ డిశ్చార్జి అయినట్లు మెడికల్ అధికారి అంజిత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఉపాధ్యాయులు కోరుట్లలోని వేరు వేరు ఆసుపత్రులకు తరలించారు. ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలను గమనించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు సమాచారం అందించారు. రెండురోజుల నుంచి చికిత్స పొందుత్ను వారి ఆరోగ్యం కుదటపడడంతో శుక్రవారం వైద్యులు డిశ్చార్జి చేశారు.

## వీధి కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రెలు

ధర్మారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వీధికుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని నర్సింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బద్దం సుధాకర్‌రెడ్డి రాత్రి పడుకునే ముందు గొర్రెల మంద చుట్టూ కంచె ఏర్పాటు చేశాడు. గురువారం రాత్రి సమ యంలో వీధి కుక్కలు మందపై దాడి చేయడంతో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. తనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని సుధాకర్ రెడ్డి కోరాడు.

# శిథిలమైనా.. చరిత్ర పదిలం

● గ్రామాల్లో కాకతీయులకాలం బురుజులు

● నాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగిన కట్టడాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 ఆంధ్రజ్యోతి): కాకతీయుల కాలం నాటి బురుజులు శిథిలమైనా చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. శత్రువుల రాకను పసిగట్టేందుకు నిర్మించిన కట్టడాలు ఆ నాటి వైభవానికి చిహ్నాలుగా గుర్తింపు పొందుతున్నాయి. సుమారు 900ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో బురుజులు నిర్మించారు. ఈ ఎత్తైన రాతి కట్టడాలు ఆనాడు రక్షణ కేంద్రాలుగా కొనసాగాయి. పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరినా కాకతీయుల నాటి కళా వైభవాన్ని చాటుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పలువురు చరిత్రకారులు బురుజుల ప్రత్యేకతను భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు.



నారాయణపూర్‌లో శిథిలమైన బురుజు



పదిరలో ధ్వంసమైన బురుజు

### ● ఎత్తైన రాతి కట్టడాలు.. సైనికుల పహారా కేంద్రాలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని నారాయణపూర్, సింగారం, పదిర, గొల్లపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో కాకతీయుల కాలంనాటి సామంత రాజైన సింగమమహారాజు బొప్పాపూర్ కేంద్రంగా రాచర్లకోటను నిర్మించారు. ఇక్కడి నుంచి పరిపాలన సాగించేవారని చరిత్రకారులు, స్థానికులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పరిధి, ప్రజల సంఖ్యకు అనుగుణంగా శత్రువులు దండయాత్ర చేయకుండా ఉండేందుకు ఎత్తైన రాతి కట్టడాలు చేపట్టారు. బురుజుల నిర్మాణానికి మట్టి, బరువైన రాళ్లను వినియోగించిన ఆనవాళ్లున్నాయి. బురుజు నిర్మాణంలో శత్రువులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. బురుజు పైకి ఎక్కేందుకు నేల నుంచి సుమారు రెండు అడుగుల ఎత్తులో ఒక్కరే వెళ్లేలా మెట్లను నిర్మించారు. నిచ్చెన సహాయంతో ఒక్కరిద్దరూ సైనికులు మాత్రమే పైకి ఎక్కిన తర్వాత నిచ్చెన తీసేసేలా కట్టడాలు ఉన్నాయి. బురుజుకు నాలుగు వైపుల మూడు నుంచి నాలుగు రంధ్రాలను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతం నుంచి ఎవరైన వస్తున్నారా? అని సైనికులు చూసేవారు. శత్రువులు దండయాత్రకు వస్తే అందులో నుంచి తుపాకులతో కాల్చేవారు. బురుజు పైభాగంలోనూ నాలుగు వైపుల ఇటుకలు, మట్టితో గోడ, మధ్యలో రాళ్లతో ఓ గద్దె నిర్మించారు. దానిపై సైనికులు పహారా కాసేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎండావాన నుంచి రక్షణగా ఓ షెడ్డులాంటిది ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయి.

### ● చరిత్రకు చిహ్నంగా..

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని గొల్లపల్లి, పదిర, నారాయణపూర్, సింగా రం, తిమ్మాపూర్ గ్రామాల్లోని బురుజులు నాటి కళాకారుల ప్రతిభను చాటుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్నా కాకతీయుల కాలంలోని పాలన విధానాన్ని తెలియజేస్తున్నాయి. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పరిసరాల్లో నాలుగు బురుజులు ఉండేవి. ప్రస్తుతం రెండు కనుమరుగయ్యాయి. ఓ బురుజుకు మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి మూడేళ్ల కిందట మరమ్మతు చేయించారు. ఆయన పదవి కాలంలో గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవాలకు బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. నారాయణపూర్, సింగారం, తిమ్మాపూర్, గొల్లపల్లి, పదిర తదితర గ్రామాల్లోని బురుజులు శిథిలవస్థకు చేరుకున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బురుజులను పరిరక్షించాలని, కాకతీయులకాలం నాటి సంపదను భవిష్యత్ తరాలకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్లారెడ్డిపేటలోని బురుజు పైభాగంలో ధ్వంసమైన రాతికట్టడం



గొల్లపల్లిలోని బురుజు

### బురుజులు అద్భుత కట్టడాలు



కాకతీయులు కాలంనాటి బురుజులు అద్భుత కట్టడాలు. మా ఊరిలో నాలుగు బురుజులుండేవని మా తాత చెబుతుండేవారు. ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయి. వాటిని చూస్తే ఆశ్చర్యమేస్తోంది. మట్టి, పెద్దపెద్ద రాళ్లతో కట్టారు. ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. అధికారులు స్పందించాలి. నాటి చరిత్ర భవిష్యత్ తరాలకు అందేలా చూడాలి.

**- వనం రాజు, యువకుడు, ఎల్లారెడ్డిపేట**

### పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి



బురుజులను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దాలి. వాటి నిర్మాణానికి దేవాలయాలకు వినియోగించిన రాళ్లను వాడిన ఆనవాళ్లు కనిపిస్తాయి. దూరం నుంచి శత్రువుల కదలికలను కనిపెట్టేందుకు బురుజులు ఉపయోగపడ్డాయి. గ్రామాల్లోకి రజాకార్ల చొరబాటును ముందే కనిపెట్టి ఎదిరించేవారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత ముందుకొచ్చి శిథిలావస్థకు చేరుకుంటున్న బురుజులకు మరమ్మతు చేపట్టాలి. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాలను ఆవిష్కరించాలి. చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి.

**- రెడ్డి రత్నాకర్‌రెడ్డి, చరిత్రకారుడు**

### బురుజు మరమ్మతు చేపట్టాం



మా గ్రామంలోని బురుజు శిథిలావస్థకు చేరుకుంటే నాటి చరిత్రను కాపాడాలనే లక్ష్యంతో మరమ్మతు చేయించాం. బురుజుకు నాలుగు వైపుల త్రివర్ణ పతాకంలోని మూడు రంగులను వేయించి అందంగా తీర్చిదిద్దాం. బురుజుపై విద్యుద్దీపాలను ఏర్పాటు చేయించాం. ఏటా గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించాం. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాం.

**- మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి- ఎల్లారెడ్డిపేట**

## తప్పిపోయిన చిన్నారి

● వెతికి అప్పగించిన పోలీసులు



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ వీరప్రసాద్

వేములవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకలో పాల్గొనేందుకు తల్లిదండ్రులతో కలిసి వేములవాడకు వచ్చిన ఓ రెండేళ్ల హన్సిక అనే చిన్నారి తప్పిపోయిన ఘటనలో సదరు చిన్నారిని పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ కథనం మేరకు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన రమేష్-రమ్య దంపతులు గురువారం బంధువుల పెళ్లి కోసం వేములవాడకు వచ్చారు. రాత్రి బంధువుల ఇంటి వద్ద బస చేశారు. శుక్రవారం తెల్లవారుజామున బాలిక కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కుమార్తె కోసం వెతకడం ప్రారంభించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభు అనే యువకుడు తనకు రెండేళ్ల పాప కనిపించినట్లు పోలీసులకు సమాచారం అందించి పాపను పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు ఆ బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామానికి చెందిన గిరుగల శ్రీకాంత్(18) వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. గోదావరిఖనిలోని పండ్ల దుకాణంలో పనిచేస్తున్న శ్రీకాంత్ ఈనెల 18న రాత్రి సుందిల్లకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తూ మార్గమధ్యలో విద్యుత్ పోల్‌ను ఢీకొన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది శ్రీకాంత్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శ్రీకాంత్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

## కవిత్వాన్ని నడుపుతున్న ఖాలిద్...

● ఆటో డ్రైవర్‌గా ఉంటూ కవితల సృజన...



ఆటోలోనే కవిత్వం రాస్తున్న ఖాలిద్

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ షాసాబ్ స్ట్రీట్‌లో నివసించే మహమ్మద్ ఖాలిద్ వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. కవిత్వం సృజిస్తూ నటన, మిమిక్రి రంగాల్లోనూ ప్రతిభ చూపుతున్నారు. ఖాలిద్ 10వ తరగతివరకు మాత్రమే చదువుకున్నారు. ఆటో కొను క్కొని నడుపుతూ జీవనం వెళ్లదీస్తున్నారు. తెలంగాణరచయిత వేదిక ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఎన్నీల ముచ్చట్ల ప్రభావంతో కవి కావాలనుకున్నారు. తీరిక సమయాల్లో కవితలు రాయడం ప్రారంభించారు. అలా ఆయన వంద కుపైగా కవితలు రాశారు. మనమంతా ఒక్కటే పేరుతో కవితా సంపుటిని వెలువరించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో తన కవిత్వాన్ని వినిపిం చారు. రోడ్డు సేఫ్టీ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ హరితహారం, రోడ్డు భద్రతా వారోత్సవాలు, అవినీతి నిరోధక దినోత్సవం వంటి కార్యాక్రమాల్లో పాలు పంచుకున్నారు. పలు లఘు చిత్రాల్లో నటించారు. పలు పురస్కారాలు అందుకున్నారు.

## కులం నుంచి వెలేసిన పెద్దలను శిక్షించండి

● మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుల పెద్దలు తన కుటుంబాన్ని కులం నుంచి వెలేశారని, మానసికంగా వేధిస్తున్నారని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల కేంద్రానికి చెందిన క్కొరి రమేశ్ గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుంటూ తీసిన సెల్ఫీ వీడి యో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో తన కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించడంతో మానసికంగా కుంగిపోతున్నామని, కుల పెద్దల పేర్లు పేర్కొంటూ గోడును వెల్లబోసుకున్నాడు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సై తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. మరో వైపు పోలీసులు రమేశ్ ఆత్మహత్యకు యత్నించిన ప్రదేశాన్ని తెలుసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో కుల పెద్దలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# 108 అంబులెన్స్‌లకు సుస్తీ

● వారాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం ● అత్యవసర సమయాల్లో బాధితులకు తప్పని అవస్థలు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లాలోని 108 అంబులెన్స్‌లు మొరాయిస్తున్నాయి. మరమ్మతులకు నోచుకోకుండా వారాలు, నెలల తరబడి రిపేర్ షెడ్డులకే పరిమితమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే ఈ వాహనాలపై పట్టింపు కరువయ్యింది. దీంతో పక్క మండలాల అంబులెన్స్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. సమయానికి అంబులెన్స్‌లు రాకపోవడంతో రోగులు, క్షతగాత్రులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. జిల్లాలో ఉన్న సగానికి పైగా వాహనాలను తరచూ మరమ్మతులు చేయిస్తూ నడిపిస్తున్నారు. జిల్లాలో వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న కలెక్టర్ అంబులెన్స్‌లపై దృష్టి పెట్టకపోవడం గమనార్హం. జిల్లాలో 14 మండలాలకు 14 అంబులెన్స్‌లు ఉండాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. జిల్లాలో నూతనంగా వచ్చిన అంతర్గాం అంబులెన్స్‌తో పాటు ఒక నియోనాటల్, ఎనిమిది అంబులెన్స్‌లు ఉన్నాయి. జిల్లాలోని పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగుండం, పాలకుర్తి, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, కమాన్‌పూర్ మండలాలు అంబులెన్స్‌లు ఉన్నాయి. మండలానికి ఒక్క అంబులెన్స్ ఉండాల్సి ఉండగా, పది 108 అంబులెన్స్‌లు మాత్రమే రోగులను చేరవేస్తున్నాయి. ఇందులో చాలా వాహనాలు తరచూ మొరాయిస్తుండడంతో ఏడాది క్రితం ధర్మారం, మంథని, సుల్తానాబాద్, పాలకుర్తిల అంబులెన్స్‌ల స్థానంలో కొత్త 108 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. అయితే మిగతా అంబులెన్స్‌ల పరిస్థితి అలాగే ఉంది. ఒక్కో అంబులెన్స్ రోజుకు కనీసం మూడు నుంచి 10కేసులను కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్ ఎంజీఎమ్‌కు తరలిస్తుంటాయి.

ఆయా మండలానికి సంబంధించి వాహనానికి సామర్థ్యానికి మించి కేసులు వస్తూ ఉంటా యి. రిప్లేస్ అయిన అంబులెన్స్‌లు కాకుండా మిగతావి కాలం చెల్లినవే ఎక్కువ ఉన్నాయి. కానీ వాటిని మర మ్మతు చేయిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వారాల తర బడి మరమ్మతులకు పంపించడంతో పక్క మండలాల వాహనాలపై భారం పడుతోంది. దీంతో రోగులను తరలించేందుకు అధిక సమయం పడుతోంది. రోగి పరిస్థితిని బట్టి బంధువులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వాహనంలో తరలించేటప్పుడు మధ్యలో మొరాయిస్తే పక్క మండలాల అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లెక్కన రోగులు, క్షతగాత్రులు, గర్భిణుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇదిలా ఉండగా గోదావరిఖని, కమాన్‌పూర్‌లకు చెందిన వాహనాలను నెలరోజుల క్రితం స్క్రాప్‌నకు వేసేందుకు కరీంనగర్ షెడ్డుకు పంపారు. వీటిని మరమ్మతులు చేయించి నడిపించేందుకు కానీ, వాటి స్థానంలో కొత్తవి తీసుకవచ్చేందుకు కానీ పట్టించుకోవడం లేదు. ఒదెల అంబులెన్స్ ఏటువెళ్లినా మరమ్మతులకు గురవుతోంది. వాహన బయలుదేరే ముందే అదే దారి వెంట లింకు అంబులెన్స్‌లకు సమాచారం ఇస్తూ వెళుతోంది. అయితే వరంగల్, కరీంనగర్ తరలించాలంటే ఆయా ప్రాంతాల వాహనాలకు లింక్‌చేసి పంపి స్తున్నారు. అవి ఎక్కువ దూరం నడిచే పరిస్థితి లేకపోవడం కారణంగా వాహనం బయలుదేరే ముందే అక్కడి వాహనాలకు సమాచారం ఇచ్చి రోగులను అందులోకి మార్చి ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఉదాహరణకు మంచిర్యాల నుంచి వరంగల్ ఎంజీఎమ్‌కు రోగులను తరలించాలంటే సుమారు ఐదారు అంబులెన్స్‌లు మార్చాల్సిన పరిస్థితి నెలకొంది.



మొరాయిస్తున్న అంబులెన్స్ (ఫైల్)



బాధితులను మరో వాహనంలోకి మార్చుతున్న సిబ్బంది(ఫైల్)

ఈక్రమంలో మార్గ మధ్యలో ఎన్నో సంఘటనలు చోటుచేసుకున్నా అవి బయటకు రావడం లేదు. ఇక్కడి పరిస్థితి ఇలా ఉండ గానే ప్రభుత్వం జిల్లాకు నాలుగు కొత్త అంబులెన్స్‌లను కేటాయించింది. అందులో ముత్తారం, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, అంత ర్గాం మండలాలకు అంబు లెన్స్‌లను కేటాయించింది. అయితే అందులో అంతర్గాం మినహా మిగతా అంబు లెన్స్‌లన్నీ వెనక్కి పంపించారు. ఇప్పుడున్న అంబులెన్స్ లతో రోగుల ప్రాణాలకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునే అంబులెన్స్‌లపై ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. దీనిపై అధికార యంత్రాంగం, జిల్లా ప్రజాప్రతి నిధులు ప్రత్యేక చొరవ చూపి కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలు, అలాగే మండలానికి ఒక అంబులెన్స్ కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

### ● వాహనాలు పని చేయకపోతే ఉద్యోగికి గైర్హాజరు..

108 అంబులెన్స్‌లో ఒక పైలెట్, ఒక్క ఎమర్జెన్సీ మెడి కల్ టెక్నీషియన్ కలిపి ఇద్దరి చొప్పున ఉంటారు. 108 అంబులెన్స్‌లు మరమ్మతులకు గురై షెడ్డుకు వెళ్తే వీరికి వేతనాల్లో కోత ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో పని చేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువైందని వారు వాపోతున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా నిత్యం పని చేసే తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదని, వాహనాలను మార్చి తమకు నిత్యం పని కల్పించాలని వారు కోరుతున్నారు.

### ఒకరి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో సుంకరి రమేశ్(46) అనే వ్యక్తి శుక్రవారం ఉదయం కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్లుగా భార్యతో గొడవలు జరుగుతుండడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పరీక్షలు చేయించుగోగా క్యాన్సర్‌గా వైద్యుల్య నిర్ధారించారు. భార్య, పిల్లలు తనతో కలిసి ఉండాలని పలుమార్లు కుటుంబ సభ్యుల సమక్షంలో పంచాయితీ పెట్టిన వారు రాలేదు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేశ్ తల్లి కొమరమ్మ గమనించి ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేసుకుని వివరాలు సేకరించారు. కాగా తన ఆత్మహత్యకు భార్య జయ, ఇద్దరు కుమారులు, మామ, బావమరది కారణమంటూ సూసైడ్ నోట్ రాసి ఉన్నట్లు సమాచారం. రమేశ్ తల్లి కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### మల్యాలలో అగ్నిప్రమాదం

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని ఒర్రెగడ్డ ప్రాంతంలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి గృహోపకరణాల కాలిపోయాయి. సునిత అనే మహిళ తమ ఇంట్లో దేవుని ముందు దీపం వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి దీపం నుంచి మంటలు పెరిగి ఇంట్లో వ్యాపించాయి. దీంతో పెంకుటిల్లు పై కప్పునకు నిప్పు అంటుకుంది. సునిత ఇంటికి తిరిగి వస్తూ మంటలను గమనించి చుట్టుపక్కల వారికి తెలపడంతో ఆమెతో పాటు స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనలో చిన్నపాటి గృహోపకరణాల దగ్ధం అయ్యాయి.

### యువకుడి అదృశ్యం

సైదాపూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలకేంద్రంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన కామారపు శ్రీకాంత్(25) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ ఇంటి నుంచి గురువారం ఉదయం బైక్(టీఎస్02ఈజె1215))పై బయటకు వెళ్లాడు. ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారిని అడిగినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం శ్రీకాంత్ తల్లి కామారపు బుచ్చవ్వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుచ్చవ్వ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుపతి తెలిపారు.

## రేపు ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ పోటీల నిర్వాహణలో భాగంగా ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆదివారం నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడాశాఖాధికారి బి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పాఠశాల మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 27 నుంచి హన్మకొండలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన వైష్ణవి



కోచ్ మధుకర్‌తో వైష్ణవి

సుల్తానాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఖోఖో క్రీడాకారిణి జి. వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా శిక్షణా కేంద్రంలో అంతర్జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారుడు, కోచ్ గెల్లు మధుకర్ ఆధ్వర్యంలో వైష్ణవి ఖోఖోలో శిక్షణ పొందుతోందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేష్ తెలిపారు. ఈ మేరకు సుల్తానాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలలో వైష్ణవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుందని ఆయన తెలిపారు. వైష్ణవిని గెల్లు మదుకర్‌తో పాటు సీఐ సుబ్బారెడ్డి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, పెటా కార్యదర్శి దాసరి రమేష్ తదితరులు అభినందించారు.

# క్రమబద్ధీకరణ అయ్యేదెన్నడో..?



వారంతా కాంట్రాక్టు లెక్చరర్లు. నిత్యం విద్యార్థులకు పాఠాలు చెబుతున్న వారు ఎప్పుడో ఒకప్పుడు తమ ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోతాయా అనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు కావడంతో వేతనాలు కూడా నెల నెలా అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారికి అందే వేతనాలు కూడా సరిగ్గా అందకున్నా నెట్టుకొస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుని ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమందిని రెగ్యులర్ చేసింది. ఖాళీ పోస్టుల లెక్కతేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. అనంతరం ఎన్నికలు జరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరికొంత మందిని క్రమబద్ధీకరించింది. ఇంకా కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశ మాత్రం తీరలేదు. దీంతో ప్రస్తుతం వారంతా ఆందోళన చెందుతున్నారు.

- జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ల ఎదురుచూపులు
- ఐదు నెలలుగా అందని వేతనాలు
- రాష్ట్రంలో 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల అవస్థలు

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్నోఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు.. తమఉద్యోగాల క్రమ బద్ధీకరణ (రెగ్యులరైజేషన్) కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కాంట్రాక్టు లెక్చరర్ల కొలువులను క్రమ బద్ధీకరించే ప్రక్రియ ప్రారంభించి రెండేళ్లు పూర్తయినా ఇంతవరకు సగం మంది ఆశలు కూడా నెరవేరలేదు. ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమేరకు రాష్ట్రంలో 3,538 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే మొదటి వారంలో 3,093 మందిని క్రమ బద్ధీకరించింది. పోస్టులు లేవనే కారణంతో మిగిలిన 445మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించకుండా నిలిపివేసింది. ఖాళీ పోస్టుల లెక్క తేలిన అనంతరం మిగిలిన వారిని రెగ్యులర్ చేస్తామని హామీనిచ్చింది. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో క్రమ బద్ధీకరణ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంత మంది అధికారులు పోస్టులు లేవంటూ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇవ్వడంవల్ల తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. అయితే రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో 25మంది జూనియర్ కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించింది. ఇంకా 420 మంది కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలు రెగ్యులరైజ్ కావాల్సి ఉందంటు న్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగు లను రెగ్యులర్ చేయొద్దని, ఇప్పటికే రెగ్యులర్ చేసిన వారిని తొలగించ వద్దు అని ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వడంతో తమ ఉద్యో గాలు రెగ్యులరైజ్ అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరుణించి ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

**● ఐదు నెలలుగా అందని వేతనాలు..**

చాలీచాలని జీతాలతో అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో భార్యాపిల్లలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూలై 2024 నుంచి వేతనాలు అందడం లేదంటున్నారు. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక సమస్యలవల్ల వేతనాలు అందడం లేదని వాపోతున్నారు.



జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధన చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్

### కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



17 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నాను. మా తోటివారిని గత ప్రభుత్వం క్రమబద్ధీకరించి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మమ్మల్ని రెగ్యులర్ చేయకుండా నిలిపివేసింది. ఇప్పటికైనా మాపై దయ చూపి ముఖ్యమంత్రి వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వేడుకుంటున్నాను.

**- నలువాల శ్రీనివాస్, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల**

### వేతనాలు సక్రమంగా అందించాలి



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగాలు రెగ్యులరైజ్ కాకపోవడం వల్ల మానసికంగా ఆందోళనకు గురవుతున్నాము. అయిదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. వేతనాలు ఏ నెలకు ఆ నెల సక్రమంగా అందించాలి.

**- శంకరయ్య, కాంట్రాక్టు లెక్చరర్, జగిత్యాల**

## జిల్లా మహిళలకు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డు



దుబ్బాక వనజ

కరీంనగర్ కల్చరల్/జమ్మికుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు రాష్ట్రస్థాయి మిద్దెతోట అవార్డుకు ఎంపికయ్యారు. తుమ్మేటి రఘూత్తంరెడ్డి రైతు నేస్తం మిద్దెతోట పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు దుబ్బాక వనజ, జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకట రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల సాగు చేస్తున్న మిద్దెతోట రైతులను ప్రోత్సహించడానికి రైతు నేస్తం ఫౌండేషన్ ప్రతీ యేటా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. ఈ నెల 23న గుంటూరులో జరిగే సభలో వీరు పురస్కారాన్ని అందుకోనున్నారు. పురస్కా రానికి ఎంపికయిన వనజను సిటీ టెర్రస్ గార్డెన్ సభ్యులు ప్రణీత, అపర్ణ, స్వాతి మధు, భారతి, లావణ్య, శిరీష, మమత, వి సమత అభినందించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికురాలిగా దశాబ్ద కాలంగా చేస్తున్న పనికి గుర్తింపు వచ్చిందన్నారు. రసాయనాలు లేని ఆహారం పొందడానికి తాను చిరు ప్రయత్నం చేశానని తెలిపారు.



పుల్లూరి వెంకటలక్ష్మి

జమ్మికుంటకు చెందిన పుల్లూరి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లుగా తాము మిద్దె తోట నిర్వహిస్తున్నామన్నారు. సేంద్రియ పద్ధతిలో తాము కూరగాయలు, ఆకుకూరులు పండిస్తు న్నామని చెప్పారు. తమకు ప్రేరణ కలిగించిన తుమ్మేటి రఘోత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన పేరిట ఇచ్చే అవార్డును తనను ఎంపిక చేసిన రైతునేస్తం ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# దోపిడీ ముఠా అరెస్టు

- రూ.5 లక్షల విలువ గల బంగారం, 10 వేల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో ఈ నెల 13వ తేదీన దోపిడీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మున్నీసుల శ్రీనివాస్, చిప్పబత్తుల తులసయ్య, బక్కనపల్లి అరుణ్, యశోద శ్రీనివాస్, సైదు సహదేవ్, రత్నం మాణిక్యం, ముగునూరి కిరణ్ కుమార్ ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. కొన్ని రోజుల నుంచి గుప్త నిధుల కోసం గాలిస్తున్నారు. ఎక్కడా గుప్త నిధులు దొరకకపోవడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలని భావించారు. ఈ క్రమంలో బీర్‌పూర్‌లో డబ్బులు, బంగారం ఉన్న కాసం ఈశ్వరయ్య ఇంటిని దొంగతనానికి ఎంచుకున్నారు. ఇద్దరు వృద్ధులు ఇంట్లో ఉన్నారని తెలుసుకుని 13వ తేదీన రాత్రి మంకీ క్యాప్‌లు ధరించి, బొమ్మ తుపాకీలు పట్టుకుని కిరణ్‌కుమార్, అరుణ్, తులసయ్య, మునీశ్వర్, శ్రీనివాస్‌లు నెంబర్ లేని రెండు ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రి కాసం ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశారు. అతడి భార్యను కొట్టి నోట్లో గుడ్డలు కుక్కి, బంగారంతో పాటు ఇంట్లో ఉన్న డబ్బులు తీసుకుని తుమ్మెనాలకు వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. దొంగలు ధర్మపురి మండలం తుమ్మెనాల గుట్ట వద్ద ఉన్నారని తెలుసుకున్న పోలీసులు డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి శుక్రవారం ఆరుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారి వద్ద రూ.5 లక్షల విలువ గల బంగారం, రూ.10 వేల నగదు, రెండు బొమ్మ తుపాకులు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చాకచక్యంతో దొంగలను పట్టుకున్న సీఐ కృష్ణారెడ్డి, ఎస్సైలు కుమార స్వామి, సుధాకర్, శ్రీధర్ రెడ్డి, దత్తాత్రేయ, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తదితరులను ఎస్పీ అభినందించి, ప్రోత్సాహకరంగా నగదును అందించారు.




మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

## డయల్ యువర్ ఆర్ఎంకు స్పందన



సమస్యలు వింటున్న ఆర్ఎం బి రాజు

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమానికి స్పందన లభించింది. ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు ప్రయాణికుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను స్వీకరించారు. మొత్తం 14 ఫోన్ కాల్స్ వచ్చాయని, వీటిని పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేస్తామని వివరించారు. సలహాలు, సూచనలు అందించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# వాహనదారుల చెంతకే పెట్రోల్, డీజిల్

**- ఊరూరా తిరిగి క్యాన్ల ద్వారా సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్స్**



గన్నేరువరంలో రైతులకు డీజిల్ విక్రయిస్తున్న డెలివరీ బాయ్



ఖాసీంపేటలో ద్విచక్ర వాహనదారులకు పెట్రోలు పోస్తున్న డెలివరీ బాయ్

గన్నేరువరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం హైవేకు దూరంగా ఉంటుంది. ప్రజా రవాణా సౌకర్యమూ తక్కువగానే ఉంటుంది. ఏ అవసరం వచ్చినా ప్రజలు సొంత వాహనాలపైనే కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. వ్యవసాయానికి ట్రాక్టర్లూ పెద్ద సంఖ్యలోనే వినియోగిస్తుంటారు. మండలంలో పెట్రోల్ బంక్‌లు సరిపడా లేకపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

దీన్ని గమనించిన ఓ వ్యాపారి పెట్రోల్, డీజిల్‌ను డోర్ డెలివరీ చేయడం ప్రారంభించాడు. మండలంలోని పారువెల్ల, ఖాసీంపేట, యాస్వాడ, గన్నేరువరం, మైలారం, మాదాపూర్, హన్మాజిపల్లి, గోపాల్‌పూర్, జంగపల్లి గ్రామాలకు ఆటో ట్రాలీలో 5, 10, 20, 40 లీటర్ల క్యాన్ల ద్వారా పెట్రోల్, డీజిల్‌ను తీసుకువస్తాడు. బంక్‌లో ధరకంటే ఒక్కో లీటర్‌కు అదనంగా ఒక రూపాయి తీసుకొని ఫోన్ చేసిన వారికి ఇంటి వద్దకు వచ్చి సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు తమ ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో అవసరం పడే డీజిల్‌ను ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటి వద్దనే పొందుతున్నారు. ఆయా గ్రామాల్లోని ద్విచక్ర వాహనదారులు పెట్రోల్ బంకులకు వెళ్లకుండా వారి ఇంటి వద్దనే పెట్రోల్‌ను కొంటున్నారు. ఈ పద్ధతితో తమ ఇబ్బందులు తీరాయని మండల వాసులు అంటున్నారు.

**● సమయం ఆదా అవుతుంది..**

**- తోట రాజేందర్, రైతు, మైలారం,**



ఒక్క ఫోన్ చేయగానే ఇంటి వద్దకు వచ్చి పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేయడం వల్ల మాకు సమయం ఆదాఅవుతుంది. మా గ్రామానికి దగ్గరలో బంక్ లేకపో వడంతో గతంలో వేరే ప్రాంతాల్లోని బంక్‌కు వెళ్లి క్యాన్లలో తెచ్చుకునే వాళ్లం. దీంతో చాలా సమయం వృథా అయ్యేది. ఇప్పుడు డోర్ డెలివరీ సేవలతో సమయం ఆదా అవుతుంది. లీటర్‌కు ఒక్క రూపాయే అదనంగా తీసుకుంటుండడంతో పెద్దగా భారం పడడం లేదు.

## ఘనంగా వేంకటేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వేంకటేశ్వర స్వామి-పద్మావతిల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ నారాయణ, ఉపాధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ మచ్చ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, బాలె శేఖర్, తుమ్మల సదాశివా రెడ్డి, కౌన్సిలర్ కన్నాక మహేందర్, పురోహితులు శ్రీకాంత్, వేణుగోపాల స్వామి పాల్గొన్నారు.

## ఆర్టీసీ రాయితీలు వినియోగించుకోవాలి

భగత్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందిస్తున్న రాయితీలు, పథకాలను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు అన్నారు. శుక్రవారం కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలో కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలోని విలేజ్ బస్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అందిస్తున్న పథకాలు రాయితీలపై విలేజ్ బస్ ఆఫీసర్లు ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో అద్దె ప్రాతిపదికన అందిస్తున్న బస్సు ఛార్జీలను గణనీయంగా తగ్గించిన నేపథ్యంలో అద్దె బస్సులు బుక్ చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక చొరవ చూపి రెండు బస్సులను బుక్ చేయించిన హుస్నాబాద్ డిపో విలేజ్ బస్ ఆఫీసర్ వీజే రెడ్డి, అద్దె బస్సులను ఎక్కువగా బుక్ చేసినందుకు గాను కరీంనగర్‌కు చెందిన వీఎల్ నారాయణను శాలువాతో సత్కరించారు. సమావేశంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి యాభై మంది బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని తిరుగుపయనమయ్యారు.

## రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం నాగిండ్లి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఏఈవో, పీఆర్వో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మరణాలకు సీఎం బాధ్యత వహించాలి




మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టళ్ల కన్వీనర్ రంజిత్‌కుమార్

గణేష్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల హాస్టల్ విద్యార్థుల మరణాలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం అంటే గురుకుల విద్యార్థులు పిట్టల్లా రాలిపోవడమేనా అని ప్రశ్నించారు. మెట్‌పల్లి పెద్దాపూర్ గురుకులంలో నాలుగు నెలల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాము కాటుకు గురైతే ఇద్దరు మరణించారన్నారు. ఉపముఖ్యమంత్రి హాస్టల్‌కు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. హాస్టల్స్ సమస్యలపై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసల విష్ణు, బామాండ్ల నందు, శ్రీవర్ధన్, యోగేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మనోహర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాళ్లు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణితశాస్త్రవేత్త రామానుజన్ జన్మదినం పురస్కరించుకొని పదోతరగతి విద్యార్థులకు ట్రినిటీ రామానుజన్ ఒలింపియాడ్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు లెవల్-1 పరీక్షను నిర్వహించగా 12,356 మంది పరీక్ష రాశారని అన్నారు. వారిలో 2,368 మంది విద్యార్థులు లెవల్-2కు అర్హత సాధించారని, వారికి ఈనెల 22న ఒలింపియాడ్ టెస్ట్‌ను నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లలో పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. లెవల్-2 పరీక్షలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా 10వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 7,500, తృతీయ బహుమతిగా 5,000, నాలుగో బహుమతిగా 3,000, ఐదో బహుమతిగా 2,000, ఆరు నుంచి 10 ర్యాంకుల వారికి 1,500, 20 మందికి 1,000 రూపాయల చొప్పున బహుమతులను ప్రధానం చేయడంతోపాటు మెడల్, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందజేస్తామని ప్రకటించారు. దీంతో పాటు లెవల్-2 పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాలలో 10 నుంచి 100శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నర్సింహస్వామి హుండీ లెక్కింపు


హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కొడిమ్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామిహుండీ లెక్కింపు శుక్రవారం ఆలయ అధికారులు నిర్వహించారు. స్వామి వారికి భక్తుల ద్వారా 5లక్షల 25వేల రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఉడుతల వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ పరిశీలకులు రాజమౌళి, చైర్మన్ సత్యనారాయణరావు, కార్యాలయ జూనియర్ సహాయకులు రవి, కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆవిర్భావ వేడుకలు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో గల ఎల్ఐసీ కార్యాలయ భవన ఆవరణలో శుక్రవారం ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంఘ ఆవిర్భావ వేడుకలు సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సంఘ జగిత్యాల శాఖ అధ్యక్షుడు ఆమంద రాజుకుమార్ ఆధ్వర్యంలో సంఘ జెండాను ఎగరవేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

## దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కొడిమ్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన రేగుల పర్శరాములుపై దాడి చేసి గాయపరిచిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. పర్శరాములుపై అదే గ్రామానికి చెందిన దండు చంద్రశేఖర్, దండు మహేందర్, దండు శ్రీనివాస్ దాడి చేయడం తో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

### కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ, పోలీస్, మైనింగ్, ఫారెస్టు, రవాణా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న వివరాలను మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ లేని ట్రాక్టర్లు ఎన్ని ఉన్నాయి. అక్రమ ఇసుక రవాణా ఏ సమయంలో ఎక్కువ జరుగుతోంది.. వంటి వివారాలను అడిగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అర్ధరాత్రి వేళలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న మండలాల్లో పాయింట్స్ గుర్తించి చెక్ పోస్టు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ సమ న్వయంతో అక్రమ ఇసుకను జరుగుతున్న మండలాల్లో మైనింగ్ కాకుండా పట్టుకొని వాహనాలు సీజ్ చేయాలని సూచించారు. ఆర్‌డీవోలు, తహసీల్దార్‌లు అక్రమ ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పాలసీ ప్రకారం జిల్లాలో లీగల్ ఇసుక మాత్రమే రవాణా జరగాలని, అక్రమ ఇసుక రవాణా పూర్తి స్థాయిలో నివారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఎస్పీ అశోక్‌కుమార్, మైనింగ్ జిల్లా అధికారి జైసింగ్, ఆర్‌డీఓలు మధుసూదన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ లత, ఎస్పీ అశోక్‌కుమార్

# కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు సరికాదు

### డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి లేదని, ప్రభుత్వ అవగాహన లోపంతోనే నష్టం జరిగిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది నుంచి ప్రభుత్వ పథకాలను పక్కన బెట్టి అక్రమ కేసులో బనాయించడమే పనిగా పెట్టుకుందని ఆయన తెలిపారు. కేవలం కక్ష్య సాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌పై కేసు ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, ఒడ్నాల మల్లేశం, కౌన్సిలర్లు బండారి అశోక్, అయ్యోరు వేణుగోపాల్, సయ్యద్ యూనస్, తరాల్ల కార్తీక్, చిలువేరి శ్యాంసుందర్, వేముల నరేష్, సంగి శ్రీనివాస్, బండారి రంజిత్, విజయ్ పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు

కోరుట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో గంగమ్మ బోనాల జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పట్టణంలోని రవీందర్ రోడ్డుకు చెందిన గంగపుత్ర సంఘ అధ్వర్యంలో గంగమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో మహిళలు బోనాలతో ప్రత్యేక పూజలలో పాల్గొని శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం తాళ్ల చెరువు ప్రాంతంలోని గంగమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో రవీంద్ర రోడ్డుకు చెందిన గంగపుత్ర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# నేను తహసీల్దార్‌ను.. నీకు పింఛన్ ఇప్పిస్తా

### వృద్ధురాలికి మాయమాటలు చెప్పి మోసం

### రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరణ

కోరుట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 'నేను తహసీల్దార్‌ను, నీకు పింఛన్ ఇప్పిస్తాను' అంటూ ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న బంగారాన్ని అపహరించాడు. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం దుంపెట గ్రామానికి చెందిన గంగు అనే వృద్ధురాలు కోరుట్ల పట్టణంలోని నంది చౌరస్తాలోని మెడికల్‌లో మందు తీసుకోవడానికి వచ్చింది. మందులు తీసుకున్న తరువాత దుంపెట వెళ్లేందుకు బస్సు కోసం నంది చౌరస్తా వద్ద నిలబడింది. అంతలోనే వృద్ధురాలి వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పెన్షను వస్తుందా అని అడిగి తెలుసుకున్నాడు. తాను తహసీల్దార్‌నని పెన్షన్ ఇప్పిస్తానని నమ్మించి పక్కనే ఉన్న వీధిలోకి వస్తే ఫోన్‌లో ఫొటో తీసి పంపితే నాలుగు లక్షలు వస్తాయని నమ్మించాడు. వెంటనే ఆమె అతడు చెప్పిన చోటుకు వెళ్లింది. అక్కడి వెళ్లిన తరువాత మెడలో ఉన్న బంగారం తీసి ఫొటో దిగాలని, అలా ఉంటే పెన్షన్ రాదని సూచించడంతో ఆమె తన తన ఒంటి మీద ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, చెవుల కమ్మ తీసి పక్కన పెట్టింది. ఫొటో తీశానని, పక్క వీధిలో మరొకరి ఫొటో తీసేది ఉందంటూ పక్కన పెట్టిన బంగారాన్ని పట్టుకుని ఉడాయించాడు. గమనించిన వృద్ధురాలు మోసపోయినట్లు గుర్తించింది. విషయం చుట్టు పక్కల వారికి తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని కోరుట్ల రెండవ ఎస్ఐ రామచంద్రుడు తన సిబ్బందితో చేరుకోని అక్కడ ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వృద్ధురాలు గంగు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# ముగింపు దశలో ధాన్యం కొనుగోళ్లు..

(3వ పేజీ తరువాయి)

మిగిలిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 75,25,000 గోనె సంచులు అవసరమని గుర్తించి అందుబాటులో ఉంచగా ఇందులో ఇప్పటివరకు సుమారు 70 వేల గోనె సంచులు వినియోగించారు. ఇంకా అవసరమైన సంఖ్యలో కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

**● సన్న ధాన్యం కొనుగోళ్లు ఇలా..**

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటి వరకు 1,665 మంది రైతుల వద్ద నుంచి 12,016 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేశారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ. 22 కోట్లు ఉంటుందని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో సన్న ధాన్యానికి మార్కెట్‌లో ఆశించిన ధర రావడంతో రైతులు ఎక్కువగా ప్రైవేటులో విక్రయించారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వారం, పది రోజులుగా సన్నధాన్యానికి మార్కెట్‌లో ధర పడిపోతుందని రైతులు అంటున్నారు. అయితే రానున్న వారం, పది రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం వచ్చే అవకాశాలున్నట్లు సివిల్‌సప్లయి శాఖ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

**● కొనుగోళ్లు పూర్తయి మూతపడ్డ కేంద్రాలు...**

జిల్లాలోని పలు మండలాల్లో వంద శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసిన 356 కేంద్రాలను అధికారులు మూసివేశారు. ఇందులో ఇందిరా క్రాంతి పథం కేంద్రాలు, మెప్మా కేంద్రం, సహకార సంఘాల కేంద్రాలు మూత పడ్డాయి. ఈ కేంద్రాల్లో వంద శాతం కొనుగోళ్లు పూర్త య్యాయి. జిల్లాలో రానున్న వారం రోజుల్లో అన్ని కేంద్రాల్లో వంద శాతం కొనుగోళ్లు పూర్తవుతాయన్న అంచనాల్లో అధికారులున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు సుమారు మరో 1,500 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం వస్తుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

**● గతంలో ఎన్నడూలేని విధంగా..**



**వాకిడి సత్యం రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు**

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ధాన్యం కొనుగోళ్లు దాదాపుగా పూర్తి చేయడం సంతోషకరము. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు లోటుపాట్లు లేకుండా జరిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోళ్లు చేయడానికి సర్కారు సిద్ధంగా ఉంది.

## టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా టీఎన్‌జీవో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు జిల్లా సభ్యత్వం తీసుకున్నారు. టీఎన్‌జీవో సంఘం ఎప్పుడు ఉద్యోగుల శ్రేయస్సు కోసం పని చేస్తుందని, టీఎన్‌జీవో అధ్యక్షుడు మిరియాల నాగేందర్ రెడ్డి అన్నారు. టీఎన్‌జీవో నాయకులు షాహిద్, బాబు, రవీందర్, పూర్ణచందర్, గణేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్యశిబిరం

జగిత్యాలరూరల్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ 120 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, టుడీ ఎకో పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేశారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో వాహనాలు.. ఠాణాకు తరలింపు

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల బస్‌షెల్టర్.. పార్కింగ్ స్టాండ్‌గా మారడంతో మల్యాల పోలీసులు అందులో నిలిపిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బస్ షెల్టర్‌లో ఏళ్లగా ద్విచక్రవాహనాలు నిలిపుతుండడంతో ప్రయాణికులు రహదారిపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోవడంతో పలువురు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బస్‌సెల్టర్ నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాలు నిలుపకుండా బస్ షెల్టర్ ముందు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు. లక్షలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్‌లో ప్రైవేటు వ్యక్తులు వాహనాలు నిలుపుకోవడం సరికాదన్నారు.


వాహనాలను ఆటోలో ఎక్కిస్తున్న పోలీసులు

## అయ్యప్ప జాతర మహోత్సవం విజయవంతం చేయాలి

కోరుట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న అయ్యప్ప జాతర, మహోత్సవం విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, వేదపండితుడు పాలెపు రాంశర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కలిసి సంబంధిత కరపత్రం ఆవిష్కరించారు. ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. పూజల అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారి రథోత్సవం నిర్వహించి మహి శాసుర మర్దన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు గడ్డం మధు, కాసు కాంత్రి నిమిషకవి నాగరాజు, మరిపల్లి రవీ గౌడ్, గాజెంగి లక్ష్మీపతి, అల్వాల శ్రీనివాస్, శ్రీకాంత్, వాన్కర్ రాజు, కల్లూరి సాయి, చలిగంటి వినోద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న అయ్యప్ప స్వాములు

## కొడుకు చనిపోయాడని ఇంటి నుంచి వెళ్లగొట్టిన కోడలు

### పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 'నీ కొడుకు చనిపోయాడు ఇక నీవెందుకు వెళ్లిపో' అంటూ వృద్ధురాలిని కోడలు ఇంటి నుంచి గెంటివేయడంతో తనకు న్యాయం చేయాలని జగిత్యాల డీఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది జగిత్యాల పట్టణానికి చెందిన వృద్ధురాలు భూపల్లి గంగమల్లమ్మకు ముగ్గురు కుమారులు. పెద్ద మనుషుల చెప్పిన ప్రకారం తన పోషణ చూసుకుంటానన్న చిన్న కుమారుడికి తన వద్ద ఉన్న బంగారంతో పాటు కొంత పొలం ఇచ్చింది. అయితే ఇటీవల తన చిన్న కుమారుడు మరణించడంతో తనకోడలు, మనుమడు తనకు తిండి పెట్టకుండా ఇంటి నుంచి వెళ్లగొట్టారని పోలీసులతో వాపోయింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం

### కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం పత్రిక ప్రకటనను విడుదల చేశారు. విద్యా, ఉపాధి రంగాలను అభివృద్ధి చేయడానికి తమ ప్రజా ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. నిరుపేదల సంక్షేమామే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాట్లు తెలిపారు. సంక్రాతికి సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు.

## వేములవాడ బస్సులను పూడూర్ నుంచి నడపాలి

### ఆర్ఎంకు వినతి పత్రం అందించిన మాజీ సర్పంచ్

కొడిమ్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నుంచి జగిత్యాలకు నడుపుతున్న ఆర్టీసీ బస్సులను పూడూర్ నుంచి నడపాలని కరీంనగర్ ఆర్ఎంకు చెప్యాల మాజీ సర్పంచు అక్కపెల్లి రాజేశం శుక్రవారం వినతి పత్రం అందించారు. కనీసం రెండు బస్సులైన వేములవాడ నడిపి జగిత్యాల వయా పూడూర్ మీదుగా నడిపి గ్రామస్తులకు పూడూర్ వెళ్లేందుకు సౌకర్యం కలిపించాలన్నారు.

## వాల్మీకి ఆవాస భవనానికి చేయూత

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాల్మీకి ఆవాసం నూతన భవన నిర్మాణానికి చేయూతనందించారు. పట్టణంలో సేవా భారతి ఆధ్వర్యంలో 32ఏళ్లుగా గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచిత వసతి కల్పిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్న ఆవాస నూతన భవన నిర్మాణానికి అసోసియేషన్ తరుపున రూ.51వేలు తమవంతు సహాయం అందించగా, భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్ అధినేత ములాసపు రాజన్న తన వ్యక్తిగతంగా రూ.51వేలు అందజేశారు. సంఘ బాధ్యులు ఎర్ర నర్సయ్య, పరంధామ్, కౌన్సిలర్ కూసరి అనిల్, ఆవాస కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జిడిగె పురుషోత్తం, మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

## 'సమస్యల సాధన గణిత అధ్యయనంతోనే సాధ్యం'

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో పలు సమస్యలను సాధించే మార్గం గణితం చూపుతుందని పా ఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 22న భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్ర వారం రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో గణిత శాస్త్ర అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. గణిత ఉపాధ్యాయు రాలు తరంగిణి, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ, రాజేశం, పద్మ, ప్రశాంత్, అర్షియా, ఫర్వీన్ పాల్గొన్నారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

### యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినూత్న రెడ్డి

జగిత్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుచిత వ్యాఖ్యాలతో అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌సా అవమానపరిచారని, ఆయన్ని వెంటనే బర్తరప్ చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి వినూత్నరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామిరెడ్డి, నాయకులు భార్గవ్, సందీప్, భూమారెడ్డి, హరీశ్, అఖిల్, అజయ్ పాల్గొన్నారు.

**కోరుట్ల** : అమిత్‌షా దళితులకు క్షమాపణ చెప్పాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో శుక్రవారం డిహెచ్‌పీఎస్ కోరుట్ల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరు గురాల భూమేశ్వర్ నిర్వహించగా లక్ష్మణ్ ముఖ్య అతి దిగా పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోనుగూరి హనుమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాంబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నం రాధ, సామాజిక ఉద్యమ కవి భూమయ్య, అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షుడు రాజేష్, గంగా నర్సయ్య, పాల్గొన్నారు.

**ధర్మపురి:** పట్టణంలో యువజ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు ఆశోద అజయ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, ఉపాధ్యక్షులు పాల గణేష్, ప్రధాన కార్యదర్శి రాపర్తి సాయికుమార్, పాల్గొన్నారు.

**మల్యాల:** మల్యాలలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రవీందర్, బాబు, రవి, తిరుపతి, అనిల్, అలంకార్, నివాస్, స్వేరోస్, నర్సయ్య, ప్రశాంత్, ప్ర భుదాస్, మహేష్ పాల్గొన్నారు

**కొడిమ్యాల** : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు, అఖిల పక్షం నాయకుల సమక్షంలో నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్తూరి స్వామి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్ పాల్గొన్నారు.

**రాయికల్:** రాయికల్ యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. రాయికల్ పట్టణ అధ్యక్షుడు మేకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్య రాకేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మహ్మద్ షాకీర్ పాల్గొన్నారు.

**మెట్‌పల్లి టౌన్** : పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు లింగం, టీపీసీసీ నాయకులు అవెజ్, పాల్గొన్నారు.


జగిత్యాలలో నిరసన తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నేతలు

**ఇబ్రహీంపట్నం:** కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కాశిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జలేష్, వెంకట్‌పాల్గొన్నారు.

**కథలాపూర్** : మండల కేంద్రంలో అంబేద్కర్ మాల సంఘ నేతలు ప్లకార్డులు ప్రదర్శించారు. బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నరేశ్, కోట శంకర్, జంగ నరేశ్, రాధాకృష్ణ, ఉన్నారు.

**మెట్‌పల్లి రూరల్** : మండలంలోని వేంపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిరసన తెలిపిన వారిలో మాల సంఘం నాయకులు, సభ్యులు ఉన్నారు.

**జగిత్యాల అర్బన్:** పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ధర్మ సమాజ్ పార్టీ నాయ కులు గడ్డం హరీష్ గౌడ్, నాయకులు తిరుపతి, అరుణ్ నేత, గంగరాజం, రమేష్, నరేష్, అనిల్ పాల్గొన్నారు.

## పెయింటర్స్ ర్యాలీ

కోరుట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పెయింటర్లకు సహకారం అందించవద్దని ఉపాధి లేక పట్టణంలో ఉన్న పెయింటర్లు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ శుక్రవారం పట్టణంలో పెయింటర్స్ యూనియన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వివిధ పెయింటింగ్ దుకాణాలలో యజమానులను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అడ్లపాటి గంగాధర్, ప్రేమ్ సాగర్, హరీష్, బాబా పఠాన్, రాజాబోస్ పాల్గొన్నారు.

## క్షయ నివారణకు కృషి చేయాలి

పెగడపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండలంలోని క్షయ వ్యాధి విజేతలకు టీబి అలర్ట్ ఇండియా, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేష్, టీబి అలర్ట్ ఇండియా జిల్లా బాధ్యులు దాసరి అనీల్, శ్రీనివాస్, ఎస్టీఎస్ మహేష్ ఉన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

### జిల్లా విద్యాధికారి రాము

రాయికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. రాయికల్, ఆలూరు, మూటపల్లి, భూపతిపూర్ పాఠశాలల్లో గ్రేడ్-1 విద్యార్థులకు మూల్యాంకనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలూరు పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలో చేరిన గ్రేడ్-1 విద్యార్థుల్లో ఉన్నత అంతర్గత నైపుణ్యా లకు అనుగుణంగా పాఠ్య పుస్తకాల రూపకల్పనకు ఈ మూల్యాంకనం తోడ్పడుతుందని తెలిపారు. స్టూడెంట్ అసెస్‌మెంట్, టీచర్ ఇంటర్వ్యూ రెండు అంశాలలో ప్రాథమిక పాఠశాల ఆలూరు, మూట పెల్లిలో 1వ తరగతి విద్యార్థులకు మూల్యాంకనం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవు లు, ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్, సతీష్, శ్రీనివాస్, విద్యాప్రవేశ్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు సత్యనారాయణ, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప జాతర

కథలాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గుంటి పెరమాళ్ళ సన్నిధిలో శుక్రవారం అయ్యప్ప జాతరోత్సవం ఘనంగా జరిగింది. అయ్యప్ప నామ స్మరణతో జాతర మారుమోగింది. అయ్యప్ప స్వాములు ఆటా, పాటలతో చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయ్యప్పను వేడుకుంటూ రాంశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరికొండ, దుంపెట, భూషణరావుపేట తదితర గ్రామాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

## యువతి వివాహానికి ఆర్థికసాయం

ధర్మపురి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని బూరుగుపల్లె గ్రామానికి చెందిన యువతి కుంటాల సత్యన్న-జయ కూతురు ఆర్తి వివాహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రూ 10 వేలు ఆర్థికసాయం అందించారు. విప్ అడ్లూరికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

**సారంగాపూర్** : అర్పపల్లి గ్రామానికి చెందిన లైశెట్టి జమున రాజన్న దంపతుల కూతురు లాస్య వివాహానికి గ్రామానికి చెందిన మాజీ జిల్లా ఎస్సీఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎండబెట్ల ప్రసాద్ అతని మిత్ర బృందం రూ. 12వేల నగదు అందజేశారు.

## విద్యుత్‌సరఫరాలో అంతరాయం

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలన్నారు.

కథలాపూర్: ఈ నెల 21న మండలంలోని కథలాపూర్, చింతకుంట, బొమ్మెన, భూషణరావుపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దివాకర్‌రావు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా, కథలాపూర్, భూషణరావుపేట, దూలూరు, బొమ్మెన, తక్కళ్లపల్లి, ఊట్‌పల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల దాకా త్రీఫేజ్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

## అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

మల్యాల, డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): మల్యాలలోని హరిహరపుత్ర అయ్యప్ప ఆలయ 8వ వార్షికోత్సవంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం బలిపీఠాల ప్రతిష్ఠాపన, స్వామి వారికి పంచామృత అభిషేకం తదితర పూజా కార్యక్ర మాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. గురుస్వామి మిట్టపల్లి లక్ష్మీ నారాయణ అయ్యప్ప దీక్షపరులతో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు .